సూర్య
నేటి దినపత్రిక
18వ వసంతం
www.suryaa.com
ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా
బుధవారం,25 డిసెంబర్ 2024 8 పేజీలు

# క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు

### రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖా మంత్రి పార్థసారథి



**నూజివీడు, మేజర్‌న్యూస్:**ప్రేమ, దయాగుణం క్రీస్తు బోధనలు. వాటిని ప్రతీ ఒక్కరూ ఆచరించాలని, క్రిస్మస్ పండుగ ప్రతీ ఒక్కరి ఇంటిలోనూ సంతోషాలు నింపాలని క్రిస్మస్ పండగ సందర్భంగా క్రైస్తవ సోదరులకు రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమ, త్యాగానికి ప్రతీకైన యేసుక్రీస్తు బోధనలు ప్రతీ ఒక్కరికీ అనుసరణీయమన్నారు. ప్రేమ, శాంతి, దయాగుణాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప వ్యక్తి 'యేసుక్రీస్తు' అని ప్రతీ ఒక్కరూ ప్రేమ, దయాగుణాన్ని కలిగి ఉండాలన్నారు. ప్రేమ, దయాగుణాన్ని ఇతరులకు పంచాలని క్రీస్తు ప్రజలకు బోధించడమే కాక, జీవించి చూపించారన్నారు. క్రైస్తవ సోదర, సోదరీమణులందరూ క్రిస్మస్ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య సంతోషంగా జరుపుకోవాలని మంత్రి ఆకాంక్షించారు.

### క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన

# ఎంపీ పుట్టా మహేష్ కుమార్



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** ప్రేమ, కరుణ ద్వారా మానవాళిలో ఆనందం నింపిన ఏసుక్రీస్తు జీవితం అందరికీ ఆదర్శప్రాయ మని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. ఏలూరు పార్లమెంట్ నియోజక వర్గం పరిధిలోని క్రైస్తవ సోదరులకు ఎంపీ మహేష్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఏసుక్రీస్తు జన్మదినమైన క్రిస్మస్ పర్వదినాన్ని ప్రజలంతా సుఖ సంతోషాలతో జరుపుకోవాలని ఎంపీ మహేష్ కుమార్ ఆకాంక్షించారు.

# కరుణ,ప్రేమ,దయ,త్యాగానికి ప్రతీక క్రిస్మస్

### జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి



**ఏలూరు,మేజర్‌న్యూస్:** క్రిస్మస్ పండుగని పురస్కరించుకుని జిల్లాలోని క్రైస్తవ సోదర,సోదరీ మణులందరికీ జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి క్రిస్మస్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. బైబిల్ పేర్కొన్న ప్రేమ, క్షమగుణం, దయాతత్వం, శాంతితత్వం ప్రతిఒక్కరూ కలిగివుండాలన్నారు. నిస్సహాయులపై కరుణ చూపాలని శతాబ్దాల క్రితమే క్రీస్తు ప్రబోధించారని ఆమె గుర్తు చేశారు. క్రైస్తవసోదర, సోదరీమణులందరూ క్రిస్మస్ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆకాంక్షించారు.

# క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన జిల్లా కలెక్టర్ నాగరాణి



**భీమవరం,మేజర్‌న్యూస్ :** క్రిస్మస్ పండుగని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి జిల్లా ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగం,ప్రేమ,కరుణ గొప్పతనాన్ని ఏసుక్రీస్తు తన బోధనలు ద్వారా విశ్వ మానవాళికి తెలియచేసారన్నారు.క్రీస్తు అనుసరించిన మార్గం ఎంతో ఆదర్శమన్నారు. యేసుక్రీస్తు ప్రపంచ సర్వమత శాంతి స్థాపన కొరకు పుట్టిన మహనీయుడు, గొప్ప శాంతి దూతన్నారు. శత్రువులను సైతం క్షమించమని చెప్పిన కరుణామూర్తి యేసు క్రీస్తు అని తెలిపారు. ఆయన చూపిన శాంతి మార్గంలో పయనించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలోని క్రైస్తవ సోదర సోదరీమణులు అందరూ క్రిస్మస్ వేడుకలను ఘనంగా, ఆనందోత్సాహల మధ్య జరుపుకోవాలని ఈ సందర్భంగా ఆమె కోరారు.

### క్రైస్తవ సోదర, సోదరీమణులకు

# క్రిస్మస్ శుభాకాంక్షలు : జిల్లా ఎస్పి



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ జిల్లాలో ఉన్న క్రైస్తవ సోదర, సోదరీ మణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈపవిత్రమైన పండుగ రోజుల్లో మీ జీవితాలలో ఆనందం,శాంతి ,ప్రేమనిండాలని కోరుకుంటు న్నాం. ప్రతి కుటుంబానికి ఆనందకరమైన సమయాలు, స్నేహం, ఆరోగ్యంకలగాలని ఆశిస్తు న్నాం. మీరు,మీ కుటుంబ సభ్యులు సురక్షితంగా హర్షభరితంగా ఉండాలని ఆకాంక్షిస్తూ, క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియ చేస్తున్నామని అన్నారు.



# క్రిస్మస్ శుభాకాంక్షలు

### ఆర్‌టిసి జోనల్ చైర్మన్ అప్పలనాయుడు

**ఏలూరు,మేజర్‌న్యూస్ :** ఏసుక్రీస్తు జన్మదినమైన క్రిస్మస్ పర్వదినాన్ని ప్రజలంతా సుఖసంతోషాలతో జరుపుకోవాలని విజయవాడ జోనల్ చైర్మన్, నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జీరెడ్డి అప్పల నాయుడు తెలిపారు. ప్రేమ, దయ, కరుణ ద్వారా మానవాళిలో ఆనందం నింపిన ఏసుక్రీస్తు జీవితం ప్రజలందరికీ అనుసరణీయ మని ఆయన అన్నారు. ఏసుక్రీస్తు అందించిన శాంతి, ప్రేమ, దయ, ఐకమత్యం సందేశాన్ని ప్రతిఒక్కరూ ఆచరించాలని ఆయన సూచించారు.. క్రిస్మస్ పండుగతో ప్రతి వెంట శాంతి, సౌభాగ్యాలు నెలకొనాలని ఆకాంక్షిస్తూ క్రైస్తవ సోదర సోదరీమణులకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు..

### సరిహద్దు గ్రామాలపై

# ప్రత్యేక నిఘా పెట్టాలి

**- జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్**



**ఆగిరిపల్లి,మేజర్‌న్యూస్:** సరిహద్దు గ్రామాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని, బాల్య వివాహాలు, సాంఘిక దురాచారాలను అడ్డుకునే చర్యలు తీసుకోవాలని, లోన్ యాప్ మోసాలు, సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంచాలని పెట్టాలి: జిల్లా ఎస్పీకె. ప్రతాప్ శివ కిషోర్ ఆదేశించారు.అగిరిపల్లి పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించిన జిల్లా ఎస్పీ పోలీస్ స్టేషన్ రికార్డుల నిర్వహణను సమీక్షించారు. ముందుగా జిల్లా ఎస్పీకి నూజివీడు డిఎస్పీ కెవివిఎన్ వి ప్రసాద్ పుష్ప గుచ్ఛంఅందించి, స్వాగతం పలికారు. అనంతరం సిబ్బంది జిల్లా ఎస్పీకి గౌరవవందనం సమర్పించారు. పోలీస్ స్టేషన్,పరిసరాలను సందర్శించి,నిర్వహణ ,రికార్డుల నిర్వహణను పరిశీలించారు. రిసెప్షన్ సెంటర్,లాకప్ గదులను పరిశీలించి, పోలీస్ స్టేషన్‌కు వచ్చే పిటీషనర్లతో మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. పోలీసులు నిర్వహించే ప్రతి రికార్డును సమీక్షించారు. ఆగిరిపల్లి పోలీసులు గతంలో సీజ్ చేసి,స్టేషన్ ఆవరణలో ఉంచిన వాహనాలు ఏ నేరాలకు సంబంధించినవో అడిగితెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల పరిస్థితులను ఎస్ఐ, సిఐలతో అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి తో మాట్లాడుతూ ప్రజలకు అతి చేరువుగా ఉండే మీరు,ప్రజలకు మెరుగైన సేవలు అందించుట కొరకు,గ్రామ సంరక్షణ కార్యదర్శులు పాటుపడాలని, అలాగే రానున్న పండగ రోజులలో మీ,మీ ప్రాంతాలలో పేకాట,కోడిపందాలు జరగకుండా ముందస్తు సమాచారాన్ని సేకరించి, పోలీస్ స్టేషన్ ఎస్.ఐకి తెలియచేసే యాలని కోరారు. మహిళల రక్షణ కోసం ఏర్పాటు చేసిన అభయ మహిళా రక్షక దళాలను స్కూల్స్, కాలేజీలు, బస్టాండ్ల వద్ద గస్తీ తిరిగేలా మహిళా సిబ్బందిని వినియోగించాలని అధికారులకు ఆదేశిం చారు.ఈ కార్యక్రమంలో నూజివీడు రూరల్ ఇన్స్పెక్టర్ రామ కృష్ణ,ఆగిరిపల్లి ఎస్ఐ శుభ శేఖర్ మరియు పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### యుద్ధ ప్రాతిపదికన

# అంగన్వాడీ కేంద్రాల్లో పనులు

**- నాణ్యత లేకుండా నాసిరకం కట్టడాలుంటే చర్యలు**



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** జిల్లాలో అంగన్వాడీ కేంద్రాలలో చేపట్టిన టాయిలెట్స్, త్రాగునీటి సౌకర్యం పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలనీ జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. జిల్లాలో అంగన్వాడీ కేంద్రాలలో చేపట్టిన టాయిలెట్స్, త్రాగునీటి సౌకర్యం వంటి మౌలిక సదుపాయాలకల్పన పనుల ప్రగతిపై కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి ఆర్ డబ్ల్యూఎస్, ఐసిడిఎస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలోని 227 అంగన్వాడీ కేంద్రాలలో టాయిలెట్ల నిర్మాణానికి గాను 225 టాయిలెట్లు పూర్తి అయ్యాయని,186 అంగన్వాడీ కేంద్రాలలో త్రాగునీటి సౌకర్యం పనులకు గాను 176 పనులు పూర్తిఅయ్యాయని, మిగిలిన పనులను కూడా ఈవారం చివరిలోగా పూర్తి చేయాలనీ ఆర్ డబ్ల్యూఎస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. టాయిలెట్ల కు తప్పనిసరిగా పైపు లైన్ల ద్వారా నీటి సౌకర్యం కల్పించాలన్నారు. పూర్తి ఐన టాయిలెట్లను వెంటనే వినియోగంలోకి తీసుకు రావాలన్నారు. నిర్మాణ పనులను తాను ఆకస్మికంగా తనిఖీ చేస్తానని, ఎక్కడైనా నాణ్యత లేకుండా నాసిరకం కట్టడాలుంటే వెంటనే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటా నని కలెక్టర్ హెచ్చరించారు.జిల్లాలోని 855 అంగన్వాడీ కేంద్రాలలో పోషన్ వాటిక,

- తరువాయి 2లో..

# పొలసానిపల్లిలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత





భీమడోలు,మేజర్ న్యూస్ : పొలసానిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గ్రామాభివృద్ధిలో భాగంగా మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు సర్పంచ్ షేక్ రహిమా బేగం హసేన తెలిపారు. పంచాయితీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సెమీ క్రిస్మస్ కార్యక్రమంలో పాల్గొని కేకును కోశారు. గ్రామపంచాయతీ సిబ్బందికి, ప్రజాప్రతినిధులకు, ప్రముఖులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యదర్శి యు. జయరామ కృష్ణ, గ్రామ రెవిన్యూ అధికారి సాల్మన్ రాజుతో కలిసి గ్రామంలో పర్యటించారు గ్రామములో పర్యటించారు. వివిధ పథకాల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనుల ప్రగతిని పరిశీలించారు. మురుగు నీటి పారుదల వ్యవస్థను క్రమబద్ధీకరించినందుకు చేపట్టిన పనులను చూశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామంలోని ఏడవ వార్డు, 9వ వార్డుల్లో లక్షలాది రూపాయల వ్యయంతో చేపట్టిన రోడ్డు పనులను చూశారు. అనంతరం 10, 11,12 వ వార్డుల్లో మురుగునీటి పారుదల వ్యవస్థను క్రమబద్ధీకరించటం,ఆ ప్రాంతంలో వరద ముంపు బెడదను తప్పించేందుకు శిథిలమైన మురుగునీటి తూరలను తొలగించి వాటి స్థానంలో ప్రత్యామ్నాయంగా నూతన తూరలు అమర్చే కార్యక్రమాలను పరిశీలించారు. మెరుగైన పనితీరు కోసం తగు సూచనలను చేసారు. కార్యక్రమంలో కూటమి పక్ష నాయకులు బొబ్బా రమేష్,ఎం శ్రీను,బొబ్బా బాలాజీ,శ్యామ్ రాజా,మూసా పాల్గొన్నారు.

# సేవాలాల్ మహారాజ్ గుడి నిర్మాణానికి 5,116 విరాళం ఇచ్చిన కొల్లూరి



**జీలుగుమిల్లి, మేజర్ న్యూస్ :** టీ నర్సాపురం మండలం కృష్ణాపురం తండాలో నిర్మిస్తున్న సేవాలాల్ మహారాజ్ గుడి నిర్మాణానికి జీలుగుమిల్లి మండలం దర్భ గూడెం సొసైటీ మాజీ అధ్యక్షులు కొల్లూరి రాంబాబు రూ. 5116 విరాళంగా అందించినట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. తమ గుడి నిర్మాణానికి సహాయం చేసిన కొల్లూరి రాంబాబు కుటుంబ సభ్యులకు సేవాలాల్ మహారాజ్ ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని బంజారా బజరంగీ బేరి కృష్ణాపురం తండా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

# ఇంటి పన్ను చెల్లించని వారికి నోటీసులు : కమీషనర్ అంజయ్య



**నరసాపురం,మేజర్ న్యూస్ :** పట్టణంలో ఇంటి పన్నులు చెల్లించని వారికి నోటీసులు జారీ చేశామని మున్సిపల్ కమీషనర్ యం అంజయ్య తెలిపారు మంగళవారం ఉదయం 6 గంటల నుండి పలు వార్డులలో తిరుగుతూ సచివాలయసిబ్బందికి పలు సూచనలు చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరం పన్నులు చెల్లించి నరసాపురం మున్సిపాలిటీ అభివృద్ధి కోసం సహకరించాలని ప్రజలను కోరారు. బకాయిలు చెల్లించని పక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.బకాయిలు చెల్లించాలని నోటీసులతో పాటు మైక్ ద్వారా ప్రచారం చేయిస్తున్నట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో ఆర్ ఐ నానాజీ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# వాలీబాల్ పోటీలలో పాల్గొనేవారు 27న విజయవాడకు రావాలి

**భీమవరం,మేజర్‌న్యూస్ :** జనవరి 7 నుండి 13 వరకు జైపూర్, రాజస్థాన్ రాష్ట్రముల నందు జరుగు సీనియర్ జాతీయ వాలీబాల్ క్రీడా పోటీలకు రాష్ట్రం నుండి సీనియర్ మహిళల, పురుషుల జట్టులను పంపవలసి ఉంది. ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఈ నెల 27న ఇందరా గాంది మున్సిపల్ స్టేడియంలో నిర్వహించు సీనియర్ మహిళల, పురుషుల జట్టుల రాష్ట్ర స్థాయి ఎంపికలో పాల్గొనుటకు ఆశక్తి గల జిల్లా సీనియర్ వాలిబాల్ మహిళ,పురుష క్రీడాకారులు ఉదయం 7 గంటలకు ఆధార్ కార్డు,

నేటివిటి సర్టిఫికెట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ 10 పాస్ పోర్ట్ సైజ్ ఫొటోస్‌తో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ,ఎన్.టి.ఆర్. జిల్లా, విజయవాడలోగల వాలీబాల్ కోర్టునందు సంప్రదిం చాలని జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి ఎం.రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు.

# పేకాట శిబిరంపై దాడి : ఆరుగురు అరెస్ట్

**జీలుగుమిల్లి,మేజర్‌న్యూస్ :** మండలంలోని లక్ష్మీపురం గ్రామ శివారులో పేకాట శిబిరం పై దాడి చేసి 6 వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి రూ.4500 నగదు 5 ద్విచక్ర వాహనాలు 6మొబైల్ ఫోన్లును స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశామని జీలుగుమిల్లి ఎస్ఐ పి నవీన్ కుమార్ తెలిపారు.

# గ్రామ స్థాయిలో భూ సమస్యలు పరిష్కరించుకోవాలి

**పెదపాడు,మేజర్ న్యూస్:** మండలం సత్యవోలు గ్రామ పంచాయితీలో జరిగిన రెవిన్యూసదస్సులు కార్యక్రమంలో పాల్గొన్న ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటాపద్మశ్రీ ఈ కార్యక్రమంలో పాల్గొని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రెవెన్యూ సదస్సులు ద్వారా భూములకు సంబంధించి ఉన్న వివాదాలను గ్రామ స్థాయిలో పరిష్కరించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.ఫ్రీ హోల్డ్ భూ ఆక్రమణలు,సెక్షన్ 22ఎ వంటి భూములపై వివాదాల పరిష్కారం కోసం ఈ కార్యక్రమం నిర్వహించ బడుతోందని వివరించారు. 'రెవెన్యూ సదస్సులు' ప్రజలకు తమ భూముల సమస్యలను స్థానికంగా పరిష్కరించుకునేందుకు ఒక చక్కటి వేదిక అని. భూ సమస్యలు మీ గ్రామస్థాయిలో పరిష్కరించబడతాయని వెల్లడించారు. ఈ సదస్సులు ప్రజలకు తమ భూసంబంధిత సమస్యలను ఎటువంటి జాప్యం లేకుండా పరిష్కరించుకోవడానికి మంచి అవకాశాన్ని అందిస్తున్నాయి. ప్రభుత్వం ప్రజల దగ్గరికి చేరుకోవడం ద్వారా, భూసంబంధిత వివాదాలను పరిష్కరించడానికి ఈకార్యక్రమం ఎంతో ఉపయోగపడు తుందనే విషయాన్ని చైర్‌పర్సన్ ఘంట పద్మశ్రీ పునరుద్ఘాటించారు.




# యుద్ధ ప్రాతిపదికన అంగన్వాడీ కేంద్రాల్లో పనులు

మొదటిపేజి తరువాయి

హార్వెస్టింగ్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జల్ జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఇంటింటికీ కుళాయి కనెక్షన్‌లు 14 వేల 284 లక్ష్యానికిగాను ఇంతవరకు 6022 కుళాయి కనెక్షన్‌లు అందించడం జరిగిందని, మిగిలిన 8264 ఇళ్లకు నిర్దేశించిన సమయంలోగా కుళాయి కనెక్షన్లు అందించాలని కలెక్టర్ ఆర్ డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు.ఆర్ డబ్ల్యూఎస్ సూపెరిం టెండెండింగ్ ఇంజనీర్ జి.త్రినాధబాబు, ఐసిడిఎస్ ఈఓ మల్లిక, మండల స్థాయి సిడిపిఓ లు,ఆర్ డబ్ల్యూఎస్ డీఈలు, ఏఈ లు, ప్రభృతులు విసిలో పాల్గొన్నారు.

## క్రిస్టమస్ పండుగకు ముస్తాబయిన చర్చిలు



**నర్సాపురం రూరల్, మేజర్ న్యూస్:** ప్రపంచవ్యాప్తంగా క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో క్రిస్టమస్ పండుగను వేడుకగా నిర్వహిస్తారు. దీనిలో భాగంగా డిసెంబర్ 25న అన్నిచోట్ల పండుగ చేసుకుంటారు. చర్చిలను, గృహాలను రంగులతో, విద్యుత్ దీపాలతో అలంకరిస్తారు. ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన చారిత్రాత్మకచర్చులను ఎంతో అందంగా అలంకరిస్తారు. మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ దీపాలతో దేవాలయాలనుఅలంకరించారు.

## టీటీడీ పాలక మండలి రెండవ సమావేశంలో టీటీడీ బోర్డు సభ్యులు జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ

**జగ్గంపేట, మేజర్ న్యూస్ :**అతి త్వరలో శ్రీవారి భక్తులకు కేవలం గంటలోగా దర్శన భాగ్యం కల్పించేందుకు టీటీడీ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని చైర్మన్, బోర్డు సభ్యులు తెలిపారు.తిరుమలలో మంగళవారం టీటీడీ పాలకమండలి సమావేశాన్ని చైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. టీటీడీ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన బీఆర్ నాయుడు రెండవ దఫా పాలక మండలి సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట శాసనసభ్యులు, టీటీడీ పాలక మండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ పాల్గొన్నారు. మొదటి పాలకమండలి సమావేశంలో కీలక నిర్ణయాలను తీసుకున్న టీటీడీ, రెండవ పాలకమండలి సమావేశంలోనూ భక్తులకు సంబంధించి పలు అంశాలపై చర్చించారు.ప్రధానంగా తిరుమల కు వచ్చే భక్తులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా గంటలోగా దర్శనం కల్పించేందుకు అధ్యయనం చేస్తున్నట్లు చైర్మన్ తెలిపారు. ఇప్పటికే 4 కంపెనీలు డెమో ఇచ్చాయని, ప్రస్తుతం ట్రయల్ రన్ జరుగుతున్నట్లు చైర్మన్ అన్నారు. పాలకమండలి సమావేశం అనంతరం ఈవో శ్యామల రావు మాట్లాడుతూ.. టీటీడీ నిర్వహించే కార్యక్రమాలు ప్రపంచవ్యాప్తంగా తీసుకెళ్లాలని సీఎం చంద్రబాబు సూచనలు చేసినట్లు, అందుకు తగిన విధంగా టీటీడీ తగిన కార్యాచరణ రూపొందిస్తుందన్నారు.స్విమ్స్ కు జాతీయ హోదా కోసం కేంద్ర ప్రభుత్వాన్ని కోరడం జరిగిందన్నారు. నడక మార్గంలో ఆరోగ్య సమస్యల కారణంగా మరణాలు సంభవించకుండా ప్రత్యేక చర్యలకు ప్రణాళిక రూపొందించామని ఈవో తెలిపారు. భక్తులకు అందించే సేవలపై ఫీడ్ బ్యాక్ సిస్టం ఏర్పాటు చేయనున్నట్లు, అందుకై పాలకమండలిలో కీలక నిర్ణయం తీసుకోవడం జరిగిందని ఈవో అన్నారు. దేశంలోని ప్రతి రాజధానిలో టీటీడీ ఆలయాలను నిర్మించేందుకు పాలకమండలి నిర్ణయించింది.ఈ నేపథ్యంలో ముంబైలో స్వామివారి ఆలయాన్ని 10 ఎకరాలు నిర్మించేందుకు టీటీడీ ముందడుగు వేస్తోంది. క్యూలైన్లో టాయిలెట్స్ కట్టాల్సిన అవసరం ఉందని, రూ.3 కోట్లతో టాయిలెట్స్ కాంప్లెక్స్ నిర్మాణా నికి పాలకమండలి ఆమోదం తెలిపింది.

తిరుమలలోని ఓ మఠానికి షోకాజ్ నోటీసు జారీ చేయడం జరిగిందని, ఇంకా ఆ మఠం నుండి తగిన సమాధానం రాలేదన్నారు. మఠం నుంచి బదులు రాగానే తదుపరి చర్యలు తీసుకుంటామని శ్యామలరావు తెలిపారు.

# వినియోగదారులు హక్కులు వినియోగించుకోవాలి





**ఏలూరు,మేజర్ న్యూస్ :** వినియోగదారు న్యాయపాలనకు వర్చువల్ విచారణకు,డిజిటల్ సౌలభ్యం పొందవచ్చు,జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి వెల్లడి. వినియోగదారుల శ్రేయస్సుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వినియోగదారులకు అనేక హక్కులను సమకూర్చిందని వీటిని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ లోని గోదావరి సమావేశ మందిరంలో జాతీయ వినియోగదారుల దినోత్సవం జిల్లా పౌర సరఫరాల సంస్థ అధికారి ఆర్.ఎస్.ఎస్.రాజు అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ వస్తువుల కొనుగోలులో వినియోగదారులు మోసపోకుండా ఉండాలంటే వారు తప్పనిసరిగా వినియోగదారుల హోక్కులపై అవగాహన కలిగివుండటం ముఖ్యమని స్పష్టం చేశారు.ఈ పోటీలలో పాల్గొన్న విద్యా ర్థినీ, విద్యార్థులకు జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి అభినందనలు తెలియజేస్తూ జాతీయ వినియోగదారుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల ఫోరం ప్రెసిడెంట్ కోదండరామమూర్తి మాట్లాడుతూ ఈరోజు దేశ వ్యాప్తంగా జాతీయ వినియోగదారుల దినోత్సవం జరుపుకుంటున్నారని అన్నారు. చాలా మంది వినియోగదారులు వస్తువుల ప్రచారం ద్వారా మోసపోతున్నారని దీనిని నివారించడానికి వినియోగదారుల ఫోరంను దోహాదపడు తుంద న్నారు. కార్యక్రమంలో వక్తలు జోసఫ్,కట్టా సత్యనారా యణ, రామాంజనే యచార్యులు, రామరాజు, హరిప్రసాద్, తదితరులు వినియోగదారుల హక్కుల పరిరక్షణకు సంబంధించిన విషయాలపై అవగాహన కల్పిం చారు.అనంతరం జాతీయ వినయోగదారుల దినోత్సవాన్ని పురస్కరిం చుకొని విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వ్యక్తృత్వ పోటీల్లో గెలుపొందిన ప్రధమ, ద్వితీయ, తృతీయ బహుమతులను, సర్టిఫికెట్లను ఆయా విద్యార్థులకు జాయింట్ కలెక్టర్ అందజేశారు. అనంతరం జిల్లాలో వినియోగదారుల వాలంటరీ ఆర్గనై జేషన్ కమిటీ సభ్యులను దుశ్శాలువాతో జాయింట్ కలెక్టర్ సన్మానించారు. కార్యక్రమంలో విజిలెన్స్ కమిటీ సభ్యులు విజయకృష్ణ,డిఇఓ వెంకట లక్ష్మమ్మ, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజరు వి.శ్రీలక్ష్మి,విద్యార్థినీ, విద్యార్థులు, స్కూలు ఉపాధ్యాయులు, సివిల్ సప్లైయి అధికారులు, తూనికలు, కొలతలు అధికారులు, ట్రాన్స్ పోర్టు అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# హైస్కూల్ ప్లస్ పాఠశాలలను కొనసాగించండి : ఎపియస్టీఎ

**ఏలూరు,మేజర్‌న్యూస్ :** పేద,బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఇంటర్ విద్య అందించాలనే దృఢం సంకల్పంతో ఏర్పాటు చేసిన హైస్కూల్ ప్లస్ స్కూల్‌ను కొనసాగించాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జి.జె.ఎ. స్టీవెన్, ఏలూరు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కాటి వెంకటరమణ, తోట ప్రసాద్ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు.పేద పిల్లల ఇంటర్ మీడియట్ విద్య కొరకు హైస్కూల్ ప్లస్ పాఠశాలలను బలోపేతం మాత్రమే ఏకైక మార్గమని హితవు పలికారు. ప్రభుత్వ ఆశయానికి బలహీన వర్గాలకి ఇంటర్ విద్య అందించాలనే లక్ష్య సాధనకు, సంకల్పానికి అత్యంత సులభతరమైన ఉన్న మార్గం ఇదేనన్నారు. అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్ లకు పదోన్నతులు కల్పించాలన్నారు.ప్లస్ టు పాఠశాలలకు అవసరమైన మానవ వనరులు (అర్హత కలిగిన బోధకులు), భవనాలు, మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు.ఆర్థిక వ్యయంస్వల్పం మాత్రమే వెచ్చిం చాల్సి వస్తుంది ల్యాబరేటరీ సౌకర్యాలు అదనంగా కల్పిస్తే సరిపోతుంది. మండలానికి ఒక ప్లస్‌టు పాఠశాల (కోఎడ్యుకేషన్) ఉండేటట్లు చూడాల న్నారు.ఎం.పి.సి, బై.పి.సి ,సి.ఇ.సి,హెచ్.ఇ.సి గ్రూపులు వుండేలా చూడాలి. విద్యార్థుల సంఖ్య తక్కువ అనే నెపంతో మొత్తం వ్యవస్థను రద్దు చేయడం సరైంది కాదన్నారు.

# నగరపాలక సంస్థ సమావేశంలో 19 అంశాలకు ఆమోదం





**ఏలూరు,మేజర్ న్యూస్ :** ఏలూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు అధ్యక్షతన మంగళవారం ఉదయం కౌన్సిల్స్ సమావేశ మందిరంలో జరిగింది. 19 అంశాలతో కూడిన ఏజెండాను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించారు. మేయర్ నూర్జహాన్ పెదబాబు మాట్లాడుతూ శాసనస భ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి)తో చర్చించిన అనంతరం ఒక ప్రయారిటీ ప్రకారం తక్షణమే పరిష్కరించవలసిన సమస్యలను గుర్తించి ఏ జెండాలో పొందుపరచడం జరిగిందన్నారు.ఎంపిక చేసుకున్న ఇద్దరు స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులను ఆమోదించడం జరిగిందన్నారు.అదేవిధంగా 2022-23 సంవత్సరంనకు 2 వ ఇన్స్టాల్మెంట్ కింద వచ్చిన 15వ ఆర్థిక సంఘం నిధులు 3 కోట్ల 69 లక్షలు రూపాయలు నిబంధనలకు అనుగుణంగా కేటాయించిన 87 వర్కులు ఆమోదించడం.2023-24 సంవత్సరాలకు సంబంధించి మొదటి ఇనిస్టాల్మెంట్ గ్రాంట్ క్రింద వచ్చిన నిధులు 3 కోట్ల 84 లక్షల రూపాయలతో 10 వర్కులను ఆమోదించడం జరిగింది అన్నారు. మేకల కబేలా నిర్వహణ విషయంలో అనుభవజ్ఞులైన డాక్టర్ను నియమించుకోవడం, గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ ఫైనాన్స్ డిపార్ట్మెంట్ ఆదేశాల మేరకు మన మున్సిపల్ కార్పొరేషన్‌లో అన్ని డిపార్ట్మెంట్‌లో అవుట్సోర్సింగ్ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఎవరైనా మరణించినట్లయితే వారి అంత్యక్రియలు నిమిత్తం 15 వేల రూపాయలు వారి కుటుంబానికి చెల్లించుటకు కౌన్సిల్ ఆమోదం తెలిపిందన్నారు పోనంగి రోడ్డులో జరుగులమ్మ గుడి వద్దగల మరడాని రంగారావు కాలనీ ఉత్తరము వైపు కాపురస్తులు అభ్యర్థన మేరకు వీధికి సాయి కృష్ణ నగర్‌గా పేరు పెట్టుటకు కౌన్సిల్ ఆమోదించిం ధర్నాలు.ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణ అభ్యర్థన మేరకు కలెక్టరేట్ కు వెళ్లే మార్గంలో జిల్లా పరిషత్ కార్యాలయం సమీపంలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఉండే స్థలంలో దివంగత మాజీ శాసనసభ్యులు బడేటి కోట రామారావు (బుజ్జి) విగ్రహ ప్రతిష్టకు స్థలం కేటాయిస్తూ కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిందని మేయర్ నూర్జహాన్ పెదబాబు అన్నారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రంతో పాటు ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ కూడా ఆర్థికంగా,అభివృద్ధి పరంగా అస్తవ్యస్తంగా తయారైందన్నారు. రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారధ్యంలో కూటమి ప్రభుత్వం గాడిలో పెట్టడానికి కృషి జరుగుతుందన్నారు.

# 5న విజయవాడలో జరిగే హైందవ శంఖారావంకు తరలి రావాలి



**పాలకొల్లు, మేజర్ న్యూస్:** హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి, రక్షణ , సమాజ సంరక్షణ కోసం విశ్వహిందూ పరిషత్ -ఆంధ్ర ప్రదేశ్ శాఖ వారి ఆధ్వర్యంలో 5 జనవరి 2025 ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు విజయవాడ కేసరపల్లి గన్నవరం విమానాశ్రయం వద్ద లక్షలాది హైందవులతో ఏర్పాటు చేసిన 'హైందవ శంఖారావం' భారీ బహిరంగ సభకు హైందవులందరూ కులాలకు అతీతంగా వేలాదిగా సకుటుంబ సపరివారంగా విచ్చేసి ఈ సభను విజయవంతం చేసి మన హైందవుల ఐక్యతను ప్రపంచానికి చాటి చెప్పేలా కృషి చేయవలసిందిగా, మంగళవారం స్థానిక శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానము నందు జరిగిన ప్రెస్ మీట్ కార్యక్రమంలో వక్తలు పిలుపునివ్వడం జరిగినది. అలాగే ఈ సభకు విచ్చేసే హైందవుల కోసం ఆరోజు ఉదయం 6 గంటలకు పాలకొల్లు కెనాల్ రోడ్డులోని గాంధీ బొమ్మల వద్ద నుండి బస్సులు ఏర్పాటు చేయడం జరుగుతుందని ,కనుక ఈ సభకు విచ్చేసే హైందవులు ముందుగా తమ పేర్లను ఈ క్రింద తెలుపబడిన వారి వద్ద నమోదు చేయించుకోవాలని తెలిపారు, కె వివిఎస్ఎల్ ఎన్ రాజు 9848211134 బోడ సత్యజిత్ 9848174647 చెరుకూరి శ్రీనివాసరావు 9849582022 ఈ నెంబర్ను సంప్రదించాలన్నారు, ఈ కార్యక్రమంలో జక్కంపూడి కుమార్, కెవివిఎస్ఎల్ ఎన్ రాజు, బి.సత్యజిత్ , ఎం.రవీందర్ , ఎస్.ఆన ంద్ కృష్ణ, బి.శ్రీరామ్,నాళం బాబి ,డి.మోహన్ కుమార్ ,సిహెచ్. శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు,

# కరెంటు చార్జీల పెంపుపై పోరుబాట పోస్టర్ ఆవిష్కరణ





**పాలకొల్లు,మేజర్‌న్యూస్:** స్థానిక వైయస్సార్సీపి పార్టీ కార్యాలయం లో కరెంటు చార్జీల పెంపుపై పోరుబాట పోస్టర్ ఆవిష్కరణ నిర్వహించారు, వైయస్ఆర్ సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్రెడ్డి పిలుపు మేరకు పాలకొల్లు నియోజకవర్గ వైసీపీ కార్యాలయంలో ఈ నెల 27వ తేదీన రైతు పోరుబాట కార్యక్రమం నిర్వహిస్తు న్నట్లు నియోజకవర్గ ఇంచార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) తెలిపారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కాకముందే రెండు పర్యాయాలు కరెంటు చార్జీలు పెంచారని దీనివల్ల సామాన్య మధ్యతరగతి ప్రజలు ఎంతో ఇబ్బంది పడుతున్నారని అన్నారు, దళితులకు 200 యూనిట్లు ఉచితంగా వైసీపీ ప్రభుత్వం ఇచ్చిందని, దానిని తుంగ లోకి తొక్కి,కూటమి ప్రభుత్వం వారిపై కుంటి సాకులు చెబుతూ ప్రస్తుతం అదనపు భారం మోపాలని చూస్తుందని అన్నారు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎడ్ల తాతాజీ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో విద్యుత్ ఛార్జీలు పెంచారని, విద్యుత్తు కార్యాలయం వద్ద బాదుడే బాదుడంటూ నిరసనలు తెలిపిన, ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు , మరి ఇప్పుడు వారి ప్రభుత్వంలో దారుణంగా విద్యుత్ చార్జీలు పెంచారని , ఇప్పుడు దీనికి సమాధానం చెప్పాలన్నారు,వైసీపీ ప్రభుత్వం 2.49 పైసలు యూనిట్కు కొనుగోలు చేస్తే, ఎన్డీఏ కూటమి ప్రభుత్వం 5 రూపాయలకు కొనుగోలు చేస్తున్నారని ఇది దారుణం కాదాఅని అన్నారు. ఈ కార్యక్రమంలో కండవల్లి వాసు , ఉచ్చల స్టాలిన్ బాబు ,కోరాడ శ్రీను,సనిశెట్టి భగవన్నారాయణ, కోట రత్నరాజు,జోగాడ ఉమామహేశ్వరావు,చెన్ను విజయ్ ,దేవ రాజేష్, తండా శ్రీను,గుడాల సురేష్ ,శేఖర్, గంగిరెడ్డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలోనే గ్రామాలలో అభివృద్ధి పనులు

**– రూ 92 లక్షల పనులకు ఎమ్మెల్యే అంజిబాబు శంకుస్థాపన**

**భీమవరం,మేజర్‌న్యూస్ :** గ్రామాలకు మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా రోడ్డు సౌకర్యాన్ని కల్పిస్తున్నామని, గ్రామాల అభివృద్ధే లక్ష్యమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. వీరవాసరం మండలం నందమూరి గురువు, మడుగు పోలవరం, మత్స్యపూరి పాలెంలో సుమారు రూ 52 లక్షలతో రోడ్డు పనులకు, మత్స్యపూరిపాలెంలో రూ.40లక్షలతో మైక్రో పిల్టర్ వాటర్ ట్యాంకు పనులకు ఎమ్మెల్యే అంజిబాబు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ గ్రామాలు సమగ్రఅభివృద్ధి చెందుతున్నాయని, గ్రామాలు సుందరీకరణంగా మారుతున్నాయంటే కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని అన్నారు. కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యపడుతుందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే సూపర్ సిక్స్‌లోని హామీలను ఒక్కొక్కటిగా ముఖ్యమంత్రి నెరవేరుస్తున్నారని, కూటమి ప్రభుత్వ పాలనలో సర్పంచులకు గౌరవం పెరిగిందన్నారు. దేశం మొత్తం రాష్ట్రం వైపు చూసేవిధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు,డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల నేతృత్వంలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగుతోందని అన్నారు. కూటమి



ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉందని, ప్రతి గ్రామాన్ని సుందరీకరణ చేస్తామని, రోడ్లు వేస్తామని అన్నారు. కార్యక్రమంలో టిడిపి జనసేన, బిజెపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# అమిత్ షాను తక్షణమే భర్త్ రఫ్ చేయాలి : బీఎస్పీ డిమాండ్

ఏలూరు,మేజర్ న్యూస్: బహుజన్ సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు బెహెన్జీ కుమారి మాయావతి పిలుపు మేరకు రాజ్యసభలో బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ని అవహేళన చేస్తూ మాట్లాడిన కేంద్ర హెూం మంత్రి అమిత్ షా ను తక్షణమే బర్త్ రఫ్ చెయ్యాలని డిమాండ్ చేస్తూ బహుజన్ సమాజ్ పార్టీ ఏలూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 11 గంటలకు ఏలూరు పాత బస్ స్టాండ్ దగ్గర గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రదర్శనగా బయలుదేరి వెళ్ళి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద మరలా ధర్నా నిర్వహించి అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్‌కి డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు సిర్రా భారత్ మాట్లాడుతూ కేంద్ర హెూం మంత్రి అమిత్ షా ను తక్షణమే బర్త్ రఫ్ చేయాలని డిమాండ్ చేశారు. బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి నేతల రమేష్ బాబు మాట్లాడుతూ రాజ్యసభ లో కేంద్ర హెూం మంత్రి అమిత్ షా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ని అవహేళన చేస్తూ మాట్లాడటాన్ని ప్రతీ ఒక్కరూ ఖండించాలని అమిత్ షా తక్షణమే భారత ప్రజలందరికీ క్షమాపణలు చెప్పాలని కోరారు. ఈ




కార్యక్రమంలో గరికిముక్కు వెంకటేశ్వరరావు, దాసి వెంకటేశ్వర్లు, కలపాల రాజకుమార్,బుంగా ఏసు, కర్రే అంబేడ్కర్,చాట్ల శ్రీను,పోసు మణి, గుదే రాంబాబు, సీహెచ్ సాయిరాజు, తమలం ప్రసాద్, బేతాళ నాగరాజు, పల్లా యేసేబు, కొంటాం తంబి, ఖండవల్లి దివ్యవాణి,సిహెచ్ అంజిబాబు, సరిపల్లి రాజేష్, దవులూరి ధర్మారావు,కప్పల సీతారామయ్య, జొన్నకూటి రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యా సంస్థలు, వసతి గృహాల్లో పనులు వేగవంతం చేయాలి





**– అధికారులకు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశం**

**భీమవరం,మేజర్ న్యూస్ :** స్థానిక కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరం నందు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పంచాయతీరాజ్, సోషల్ వెల్ఫేర్, ఈడబ్ల్యూఐడిసి, సమగ్రశిక్ష ఇంజనీరింగ్ అధికారులతో మంగళవారం సమావేశమై ఆయా శాఖల పరిధిలో జరుగుచున్న ప్రభుత్వ విద్యాసంస్థల పనులు సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఇంజనీరింగ్ విభాగం 'మనబడి – మన భవిష్యత్తు' పథకం కింద జిల్లాలోని పాలకొల్లు రూరల్, భీమవరం రూరల్,కాళ్ళ,అత్తిలి,యలమంచిలి మండలాల్లోని 154 గ్రామాల్లో వివిధ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై ఆరాతీస్తు పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. దివ్యాంగులకు సంబంధించి ర్యాంపుల నిర్మాణాలను అత్యంత పకడ్బందీగా నిర్మించాలని సూచించారు. జిల్లాలో 14 జూనియర్ కళాశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఎంపిక కాబడిన పీఎం శ్రీ పాఠశాలల్లో ఐదు కెమిస్ట్రీ ల్యాబ్‌ల నిర్మాణాలను చేపట్టడం జరిగిందని, జనవరి 15 నాటికి పనులు పూర్తికానున్నట్లు తెలిపారు. అలాగే 21 పాఠశాలల్లో ఆట స్థలాల అభివృద్ధికి ఒక్కొక్క పాఠశాలకు రూ.2 రెండు లక్షల చొప్పున ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సాంఘిక సంక్షేమ వసతి గృహాల అభివృద్ధికి రూ.132 కోట్లు మంజూరు చేయగా, మన జిల్లాలో 23 సాంఘిక సంక్షేమ వసతి గృహాల మరమ్మత్తులు, మౌలిక వసతులు అభివృద్ధికి రూ.1.29 కోట్లను కేటాయించడం జరిగిందని తెలిపారు. ఇడబ్ల్యుఐడిసి ఆధ్వర్యంలో రూ.100 కోట్ల వ్యయంతో చేపట్టిన నరసాపురం సరిపల్లి ఫిషరీస్ యూనివర్సిటీ ఆరు బ్లాక్స్ నిర్మాణాలను చేపట్టాల్సి ఉండగా,మూడు బ్లాక్‌ల నిర్మాణాలను చేపట్టి ఇప్పటివరకు అడ్మినిస్ట్రేషన్ బ్లాక్ ను మాత్రమే పూర్తి చేయడం జరిగిందని, రెండు బ్లాకులు ఫౌండేషన్ లెవెల్లో ఉన్నాయని తెలిపారు. ఇంకా మూడు బ్లాక్ ల నిర్మాణాలను ప్రారంభించాల్సి ఉందన్నారు. రుస పథకం కింద పెనుగొండ డిగ్రీ కళాశాలకు రూ.2 కోట్ల రూపాయల వ్యయంతో మౌలిక వసతుల అభివృద్ధి పనులను చేపట్టి పూర్తి చేయడం జరిగిందన్నారు. అలాగే గణపవరం డిగ్రీ కళాశాల, పాలకొల్లు డిఎన్‌ఆర్ కళాశాల అదనపు వసతులు ఏర్పాటుకు పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో పల్లె పండుగ కార్యక్రమం కింద ఎన్ ఆర్ జి ఎస్ నిధులతో చేపట్టాల్సిన 394 సీసీ రోడ్లకుగాను ఇప్పటివరకు 176 రోడ్లను పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారి కె.శ్రీనివాసరావు, జిల్లా ఆర్డబ్ల్యూఎస్ అధికారి నాగేశ్వరరావు, ఇడబ్ల్యుఐడిసి ఈఈ బి.రంగనాథ స్వామి, సమగ్ర శిక్ష డిప్యూటీ డిఈ బి.శక్తేశ్వరరావు, ఇన్చార్జి జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి బివిఎస్ బి రామాంజనేయ రాజు, ఎఎస్ డబ్ల్యూఓలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలందరూ దేవునిలో జీవించాలి : రెవ ఫాదర్ ఇంజమాల మైఖల్



**ఏలూరు,మేజర్ న్యూస్ :** ప్రజలందరూ సుఖ సంతోషాలతో దేవుని దీవెనలతోజీవించాలని, తద్వారా నీతి న్యాయం ధర్మం ప్రకారం జీవిస్తామని జేవియర్ నగర్‌లోని అమలోధ్భవి కతెడ్రల్ చర్చ్ రెవ. ఫాదర్ ఇంజ మాల మైఖల్ అన్నారు. దేవునికి దూరంగా ఉంటే అన్యాయం అక్రమాలు జరగటం చూసున్నామన్నారు. దేవుని నమ్ముకుని సన్మార్గంలో పరోపకార బుద్ధితో జీవించాలి. ప్రజలందరూ ఒత్తిడికి గురవుతున్నారు కుటుంబ సమస్యల వల్ల నిరంతర ఉప్రార్థన చేసుకొని శాంతి సమాధానాలు పొందుకోవాలి. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన సత్ప్రవర్తనతోనే మోక్షమార్గం అభివృద్ధి ఉజ్వల భవిష్యత్తు సిద్ధిస్తుంది అన్నారు. క్రిస్మస్ పర్వదినం ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగులు నింపాలని ఫాదర్ మైఖల్ ఆకాంక్షించారు.

## పెదమిరంలోని నీటిపారుదల శాఖ భూమిని పరిశీలించిన జెసి



**కాళ్ళ,మేజర్ న్యూస్ :** కాళ్ళ మండలం పెదమిరం మహాత్మా గాంధీ క్యాన్సర్ రిసెర్చ్ ఇన్స్టిట్యూటు దగ్గరలో నీటిపారుదల శాఖ సంబంధించిన మూడున్నర ఏకరాలు భూమిని సంబంధిత శాఖ అధికారులతో కలసి మంగళవారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి పరిశీలించారు. ఇందుకు సంబంధించిన మ్యాపులను, స్థలాన్ని పరిశీలించారు. జిల్లా కలెక్టరు కార్యాలయం నుండి ఈ స్థలం వరకు ఎంత దూరం,అలాగే భీమవరం పట్టణానికి ఎంత దూరమని జిల్లా జాయింటు కలెక్టరు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా జాయింటు కలెక్టరు మాట్లాడుతూ ప్రభుత్వ భవనాలు నిర్మాణాలకు పరిశీలించడం జరిగిందన్నారు.ఇందుకు సంబంధించిన భూమి వివరాలను పూర్తి స్థాయి నివేదికను అందజేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించామని జిల్లా జాయింటు కలెక్టరు టి.రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. జిల్లా జాయింటు కలెక్టరు వెంట ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, జిల్లా నీటిపారుల శాఖ అధికారి పి.నాగార్జున రావు,జిల్లా ఇన్చార్జి డ్రైనేజీ అధికారి సి.హెచ్.సత్యనారాయణ,ఆర్‌అండ్‌బి శాఖ డిఇ రామరాజు,తహాశీల్దారు జి.సుందర సింగు, సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

## రికార్డులను పరిశీలించిన మున్సిపల్ చైర్ పర్సన్



**నర్సాపురం,మేజర్ న్యూస్ :** పట్టణంలోని పలు వార్డులలో మున్సిపల్ చైర్ పర్సన్ బర్రె శ్రీ వెంకట రమణ ఆకస్మికంగా తనకి చేశారు. 1వ డివిజన్ పబ్లిక్ హెల్త్ శానిటేషన్ వర్కర్‌ల మస్తరు ముగ్గు, బ్లీచింగ్ ఇతర స్టాక్ రిజిస్టర్ లనుపరిశీలించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ వర్షాలు అధికంగా కురుస్తున్నందువల్ల అంటు వ్యాధులు ప్రభులే అవకాశం ఉన్నదని, వార్డులలో అవసరమైన శానిటేషన్ కొనసాగించాలన్నారు. నీరు నిల్వ ఉండకుండా సిబ్బంది జాగ్రత్త వహించాలని,నీరు ఉన్నచోట దోమలు చేరి అంటు వ్యాధులకు కారణం అవుతాయని ప్రజల ఆరోగ్యమే ప్రధానంగా భావించి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రతిరోజువార్డులలో శానిటేషన్ చేయాలని, తాగునీరు, శానిటేషన్ విషయంలో ప్రజల నుండి ఫిర్యాదులు వస్తే సహించేది లేదన్నారు. ప్రతిరోజు పట్టణంలో జరిగే కార్యక్రమాలను పరిశీలన చేస్తున్నామని, అంకితభావంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని చైర్ పర్సన్ బర్రె శ్రీ వెంకటరమణఅన్నారు.ఆమె వెంటచిట్టూరి కృష్ణ,మల్లాడి బుజ్జి, గోరు సత్తిబాబు ఉన్నారు.

# పీసా చట్టంతో గిరిజనుల అభివృద్ధి : ఎమ్మెల్యే బాలరాజు





**జీలుగుమిల్లి,మేజర్‌న్యూస్ :** పిసా చట్టం ద్వారా పొందిన హక్కులు విధులతో గిరిజనులు మరింత అభివృద్ధి చెందాలని పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు సూచించారు. మంగళవారం వంకవారి గూడెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ కుంజాపార్వతి అధ్యక్షతన పిసా చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీసా చట్టం మరియు ఫారెస్ట్ రైట్ యాక్ట్ ల పై అవగాహన కల్పించారు. గ్రామ సభ అనేది గ్రామం ప్రాథమిక నిర్ణయాధికార సంస్థ,పీసా చట్టం ప్రకారం, గ్రామసభ నిర్ణయాలను అమలు చేయడానికి అనుసరించడానికి, పంచాయతీలు చట్టబద్ధంగా కట్టుబడి ఉంటాయి అన్నారు. అమలులో ఉన్న ఏదైనా చట్టం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఇవ్వబడే లేదా కేటాయించబడే ఇతర అధికారాలు,విధులను అమలు చేయడం,నిర్వర్తించడం పిసా కమిటీ లక్ష్యం అని తెలిపారు. పిసా చట్టాన్ని ఉపయోగించుకుని గిరిజనుల అంతా అభివృద్ధి చెందాలని సూచించారు. భగవాన్ బిర్సా ముండ 150వ జయంతిని జన జాతీయ గౌరవ దివస్ ను సభలో జరిపారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు.

ఈ కార్యక్రమంలో జీలుగుమిల్లి మండల అధ్యక్షులు పసుపులేటి రాము, తాసిల్దార్ స్లీవ జోజి, ఎంపీపీ పోచమ్మ, సరిపల్లి సత్యనారాయణ రాజు,బీజేపీ మండల అధ్యక్షులు కొండపల్లి ప్రసాద్, వైసిపి నాయకులు కుంజ చిన రాముడు, వంక రామకృష్ణ, గిరిజన సంఘ నాయకులు తెల్లం దుర్గారావు, మడకం శేషగిరిరావు,బిజెపి జిల్లా నాయకులు చాట్రాతి ప్రసాద్, కూటమి నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

# వెయిటింగ్ హాలు కోసం మండల పరిషత్ తీర్మానం చేశాం

**- ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ వెల్లడి**



**ముదినేపల్లి,మేజర్‌న్యూస్ :** వెయిటింగ్ హాల్ కోసం మండల పరిషత్ తీర్మానం చేయడం జరిగిందని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ స్పష్టం చేశారు. ఒక దినపత్రికలో ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రైవేటు వ్యక్తులకు ఏర్పాటు చేశారన్న ఉదంత కథనంపై ఎంపీపీ స్పందించగా, సమాచార హక్కు చట్టంపై ప్రతి పనికి ఒక రేటు అనే కథనాలపై ఎంపీడీవో వై రామకృష్ణ స్పందించారు. వారు ఈ కథనాలపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ముదినేపల్లి వంటి పెద్ద మండలంలో మండల పరిషత్ కార్యాలయంలో వివిధ పనుల కోసం వచ్చే వారికి వెయిటింగ్ హాల్ ఆవశ్యకత ఎంతైనా ఉందని సభ్యుల వినతి చొప్పున గతంలో స్టోర్ రూముగా ఉన్న గదిని మరమత్తులు చేసి వెయిటింగ్ హాల్ నిమిత్తం ఏర్పాటు చేశామన్నారు. దీనిపై ప్రైవేటు వ్యక్తులు ఎవరు లేరని ఇది సత్యం కాదని కొట్టిపారేశారు. సమాచార హక్కు చట్టంపై నిబంధనల మేరకు వ్యవహరిస్తున్నామని ప్రతి పనికి ఒక రేటు ప్రాసగా వాడడం తప్ప ఇందులో వాస్తవం లేదని ఉంటే తమ దృష్టికి తెస్తే చర్యలు చేపడతామన్నారు. మండల పరిషత్ కార్యాలయాన్ని అన్ని హంగులతో ఆధునికరించడం జరిగిందని , సమావేశపు హాలును కుదించలేదని ప్రక్కనే ఉన్న స్టోర్ రూమును కలిపి పెద్దదిగా చేయడం జరిగిందన్నారు. సభ్యులకు కార్యాలయ సిబ్బందికి ఎటువంటి అసౌకర్యాలు లేవని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మండల పరిషత్ కార్యాలయ ఆధునికరణ పనులు ఎంపీపీ వివరించారు.

# భూ వివాదాలు సామరస్యంగా పరిష్కరించుకోవాలి



**ఇరగవరం,మేజర్ న్యూస్ :** భూ వివాదాలు విషయంలో సొంత నిర్ణయాలుతో ఘర్షణలకు పాల్పడకుండా సామరస్యంగా పరిష్కరించుకోవాలని తాహిసీల్దార్ సుందర్రాజుతెలిపారు. రాపాక గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన గ్రామ రెవిన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. భూ సంబంధిత సమస్యలు ఏమైనా ఉంటే రెవిన్యూ సదస్సుల ద్వారా పరిష్కరించు కోవాలని అయన సూచించారు. కార్యక్రమంలో వివిధ సమస్యలు పరిస్కారం కొరకు పలు ఫిర్యాదులు అందినట్లు చెప్పారు. వీటి పరిష్కరానికి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు కార్యక్రమం లో సర్పంచ్ బృందావనం కృష్ణారాజు, మండల డిప్యూటీ తాసిల్దార్ బీ. మాలతి,రిసర్వే డిప్యూటీ తహసీల్దార్ వి. పోతురాజు, మండల సర్వేయర్ ప్రియాంక, విఆర్ఓలు, విఆర్ఏలు, పంచాయతీ, సచివాలయం సిబ్బంది. పాల్గొన్నారు.

# 28న ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమీషన్ మచిలీపట్నం రాక

ఏలూరు,మేజర్‌న్యూస్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాలలోని ఉప-వర్గీకరణపై విచారణ చేయడానికి నియమించిన ఏకసభ్య కమిషన్ రిటైర్డ్ ఐఎఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా ఈనెల 28వ తేదీన కృష్ణాజిల్లాలో పర్యటించనున్నట్లు ఎన్.టి.ఆర్. జిల్లా కలెక్టర్ లక్ష్మీషా తెలిపారు. ఈనెల 28వ తేదీ శనివారం ఉదయం 8.15 గంటలకు విజయవాడ నుండి బయలుదేరి ఉదయం 9.45 గంటలకు కృష్ణాజిల్లా మచిలీపట్నం చేరుకుంటారు. అనంతరం ఉదయం 10 గంటలకు మచిలీపట్నం జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహిస్తారు. అనంతరం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు వివిధ ఉప కులాల సభ్యులు, సంఘాలతో సమావేశమై వినతి పత్రాలు స్వీకరిస్తారన్నారు. ఏకసభ్య కమిషన్ ఉమ్మడి కృష్ణాజిల్లాలోని (ఉమ్మడి కృష్ణా జిల్లాలోని నూజివీడు, కైకలూరు నియోజకవర్గాల మండలాల్లో కూడా) షెడ్యూల్ కులాలకు సంబంధించి, వ్యక్తులు, సంఘాలు, సంస్థలు, నుండి మెమోరాండం లేదా వినతి పత్రాలను స్వీకరించి పరిశీలన చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికను సమర్పిస్తారని తెలిపారు. కమిషన్‌కు నివేదించే వ్యక్తులు ఉమ్మడి పశ్చిమగోదావరిజిల్లాకు చెందినవారు అయివుండాలన్నారు.

తమ మెమోరాండం, వినతి పత్రాలను,పై రెండుఅంశాలకు సంబంధిం చిన వాస్తవాలను తగు ధృవీకరణ ఒరిజినల్ పత్రాలతో ఈనెల 28వ తేదీ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 లోపు మచిలీపట్నంలో నిజెడ్పి సమావేశ మందిరంలో సమర్పించవచ్చన్నారు.

# 27న ఛాంబర్స్‌లో దివిస్ లేబరేటరీస్ చే ఉద్యోగ మేళా

**పాలకొల్లు,మేజరన్యూస్:** స్థానిక బిఆర్ఆర్ అండ్ జికే ఆర్ చాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో డిసెంబర్ 27 శుక్రవారం న దివిస్ లేబరటరీలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించబడునని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు తెలియజేశారు. ఇంటర్వ్యూస్ ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించబడునని.అభ్యర్థులు బీఎస్సీ, బీటెక్, ఎంఎస్సీ,బి ఫార్మసీ, ఎంఫార్మసీ డిగ్రీలలో ఉత్తీర్ణులై వయసు 21-25 సంవత్సరముల లోపు ఉండవలెను. నెలకు 18వేల నుండి 24వేల వరకు జీతం ,ఉచిత వసతి భోజనం పీఎఫ్ ఈఎస్ఐ, ఇతర సదుపాయములు కలవు. ఇతర వివరములకు అభ్యర్థులు సంప్రదించవలసిన నంబర్ 9912046234.

## శ్రీ భారతి విద్యాసంస్థలలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు



**ఏలూరు,మేజర్ న్యూస్ :** స్థానిక కొత్తపేట చేపల తూము సెంటర్ లో శ్రీ భారతి విద్యా సంస్థల ఆవరణలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ నేపథ్యంలో పశువుల పాక,గొర్రెలు, దేవదూత,మేరీ మాత చిత్రాలు ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా బ్రాంచ్ ప్రిన్సిపాల్ శ్రీమతి విజయ గారు మాట్లాడుతూ విద్యా సంస్థల అధినేత అన్నపునేని రవి కుమార్ గారి ఆదేశాల మేరకు ప్రతి ఏటా క్రిస్మస్ సమయంలో క్రీస్తు జనన దృశ్యాలను నిర్మించి,ప్రదర్శనకు ఉంచుతామని అన్నారు,తోటి వారిని ప్రేమించటమే క్రీస్తు లోకానికి చూపిన మార్గమని ఈ సందర్భంగా గుర్తు చేశారు.అనంతరం చిన్నారులతో క్రీస్తు జననంపై నాటికను ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో టీచర్స్, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వైయస్సార్సీపి ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షులుగా బుడితి సుమన్

**- నీకు 15,000, నీకు 15000 అంటూ మోసం చేసిన టిడిపి**



**నర్సాపురం,మేజర్ న్యూస్ :** పశ్చిమగోదావరి జిల్లా వైయస్సార్ పార్టీ ఐటీ విభాగం అధ్యక్షులుగా పట్టణానికి చెందిన బుడితి సుమన్ రెండోసారి నియమితులయ్యారు.

సోమ వారం రాత్రి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైయస్ జగన్ మోహన్ రెడ్డి దగ్గర నుండి అధికారికంగా ఉత్తర్వులు వచ్చాయి. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ రెండవ సారి నియమించిన వైస్సార్సీపీ రాష్ట్ర అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి కి,వైస్సార్సీపీ జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసా దరాజుకి, వైస్సార్సీపీ రాష్ట్ర ఐటీ విభాగ అధ్యక్షులు పోసిం రెడ్డి సునీల్‌కి హృదయ పూర్వక కృతజ్ఞతలు. కూటమి ప్రభుత్వం దొంగ హామీలతో అధికారం ఛేజిక్కుంది తప్ప ఇచ్చిన హామీలు నెరవేర్చే ఆలోచన ప్రభుత్వంకి లేదన్నారు.నీకు 15,000, నీకు 15000 అంటూ ఇంటింటికి తిరిగి మోసం చేసారు తప్ప అమలు చేసే ఆలోచన లేదని విమర్శించారు.

బాబు వొస్తే జాబ్ వస్తుంది, ప్రతినెలా నిరుద్యోగ భృతి ఇస్తాము అంటూ ప్రభుత్వం ఏర్పడి7నెలలు కావొస్తున్న దాని ఊసే లేదన్నారు. ప్రభుత్వ అధికారంలోకి రావడానికి ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు కూటమి ప్రభుత్వంకు గుర్తు చేస్తూ ఉంటామని ప్రజా సమస్యలపై పార్టీ తరపున పోరాడుతామన్నారు. దోచుకొ దాచుకో పంచుకో అనే పందాలో ఈకుటమీ ప్రభుత్వం పరిపాలన ఉందని,మళ్ళీ జన్మభూమి పెరుతో సాధారణ కార్యకర్త, ఎమ్మెల్యే నుండి సీఎం వరకూ దోచుకొనే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఐటీ వింగ్ తరపున పోరాటం కొనసాగిస్తామని సుమన్ తెలిపారు.

# ప్రతి ఒక్క వస్తువుకి బిల్లు తప్పనిసరిగా పొందాలి




**– వినియోగదారులు మోసపూరిత ప్రచారాల పట్ల అప్రమత్తంగా ఉండండి**

**భీమవరం,మేజర్ న్యూస్:** వినియోగదారులు కొనుగోలు చేసిన ప్రతి ఒక్క వస్తువుకి తప్పనిసరిగా బిల్లును పొందాలని జిల్లా రెవెన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ మందిరంలో జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు పాల్గొని వినియోగదారుల రక్షణ చట్టం పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ వినియోగదారులు ఏదైనా వస్తువు కోన్నప్పుడు తప్పనిసరిగా రసీదు పొందాలని సూచించారు. వినియోగదారులు మోసపూరిత ప్రచారాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వివిధ మాద్యమాల ద్వారా వచ్చే వ్యాపార ప్రకటనలను విశ్లేషించుకోవాలని నిర్ణయం తీసుకోవాలని పేర్కొన్నారు. సమస్య ఉంటే జాతీయ వినియోగదారుల సహాయ కేంద్రం 14404 లేదా 1915 నెంబర్ లకు ఉ.9.30 నుండి సా.5.30 వరకు పని దినాలలో సంప్రదించవచ్చన్నారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ రాష్ట్ర వినియోగదారుల సహాయక కేంద్రం ద్వారా వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని, దీని కోసం 1800 425 0082/1967 నెంబర్ కు ఫోన్ చేసి సలహాలు, సూచనలు పొందవచ్చన్నారు. అనంతరం డిఆర్ఓ వినియోగదారుల దినోత్సవంలో భాగంగా నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రశంస పత్రాలు, బహుమతులను అందజేయడం జరిగింది. తొలుత కన్స్యూమర్ వాలంటరీ ఆర్గనైజషన్ ప్రతినిధులు మాట్లాడుతూ వినియోగదారులకు పలు అంశాలపై అవగాహన కల్పిస్తూ సూచనలను చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఓ ఎన్.సరోజ, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డిఎం టి.శివరామ ప్రసాద్, జిల్లా పౌరసరఫరా శాఖ ఏఎస్ఓ ఎం.రవిశంకర్, డిఇఓ ఈ.నారాయణ, లీగల్ మెట్రాలజీ ఏసీ నాగరాజారావు, జిల్లా ఆహార భద్రత అధికారి రామ సుందర్ రెడ్డి, ఆకివీడు కన్స్యూమర్ వాలంటరీ ఆర్గనైజషన్ ప్రెసిడెంట్ బొబ్బిలి బంగారయ్య, యండగండి కన్స్యూమర్ వాలంటరీ ఆర్గనైజషన్ ప్రెసిడెంట్ యండగండి గోపాల కృష్ణ మూర్తి, వివిధ పాఠశాలల విద్యార్థులు, అధికారులు, జిల్లా పౌరసరఫరాల శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రైస్ మిల్లర్స్ జిల్లాకు మంచి పేరు తేవాలి : జెసి రాహుల్ కుమార్



తాడేపల్లిగూడెంమేజర్ న్యూస్ : జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి తాడేపల్లిగూడెం మండలం ఎల్.అగ్రహారం శ్రీనివాస ఆగ్రో రైస్ మిల్లును మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీఎంఆర్ ఎంత, డెలివరీ ఇచ్చింది ఎంత అని ప్రశ్నించి "ఏ", "బి" రిస్టర్లలో బియ్యం, ధాన్యం నిల్వ లెక్కలను పరిశీలించాలి. ఫోర్ట్ ఫైడ్ రైస్ కెన్నెల్స్ ను పరిశీలించారు. అనంతరం రైస్ మిల్లులు మొత్తాన్ని పరిశీలిస్తూ సార్ టెక్స్ మిల్లింగును క్షుణ్ణంగా పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

మిల్లుకు అనుబంధంగా ఉన్న గోడౌన్లో ధాన్యం నిల్వలను పరిశీలించడం జరిగింది. మిల్లింగ్ అనంతరం వచ్చిన తౌడును పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పిడిఎస్ రైస్ అక్రమ రవాణా పై రాష్ట్ర ప్రభుత్వం చాలా సీరియస్ గా పనిచేస్తున్నదని, జిల్లాలో ఎట్టి పరిస్థితుల్లో పిడిఎఫ్ రైస్ అక్రమ రవాణా జరగకూడదని సూచించారు. ఇటువంటి చర్యలు జిల్లాకు చెడ్డ పేరును తెస్తాయని అన్నారు. నిబద్ధతగా వ్యాపార లావాదేవీలు నిర్వహించాలని సూచించారు. రైతు పండించిన పంట ఎట్టి పరిస్థితుల్లో నష్టపోకూడదని, ఇప్పటికే ప్రభుత్వం నిబంధనలను కొంతమేర సడలిస్తూ ఆదేశాలను ఇవ్వడం జరిగిందన్నారు. దీనికి అనుగుణంగా మిల్లర్లు సహకరించి ఆఖరి గింజ వరకు కొనుగోలు చేయాలని సూచించారు. ఈ ఆకస్మిక తనిఖీలు సందర్భంలో ఆర్డీవో ఖతీబ్ కౌశల్ భానో, తహసిల్దార్ ఎం.సునీల్ కుమార్, తదితరులు ఉన్నారు.

# రెండుసార్లు విద్యుత్ బిల్లులు ప్రభుత్వం పెంచడం దారుణం

**– వినియోగదారుని పై 15,485,36 కోట్ల రూపాయలు భారం**

**– 27న జిల్లా వ్యాప్తంగా నిరసన : వైసిపి జిల్లా అధ్యక్షులు డిఎన్ఆర్**



కైకలూరు,మేజర్ న్యూస్ : వైయస్సార్సీపి అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు,అదనపు విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై మోపుతూ నిర్ణయం తీసుకున్న కూటమి ప్రభుత్వం వైఖరికి నిరసనగా ఈ నెల 27వ తేదీన శాంతియుతంగా నిరసన తెలుపుతూ కరెంట్ ఏఈకి వినతి పత్రాలను అందజేయాలని తెలియజేస్తూ ఏలూరు జిల్లా అధ్యక్షులు, దూలం నాగేశ్వరరావు తన కార్యాలయంలో పత్రికా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లోనే ప్రజలలో ఆందోళన మొదలైందని,ఈ ఆరు నెలల కాలంలో రెండుసార్లు విద్యుత్ చార్జీలను పెంచారని గృహ విద్యుత్ వినియోగదారులపై మోపిన 15,485,36 కోట్ల రూపాయల అదనపు చార్జీల భారాన్ని రద్దు చేయాలని, ప్రభుత్వమే ఆ భారాన్ని భరించాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకి ఇప్పుడు చేస్తున్న పరిపాలనకి ఏ మాత్రం పొంతన లేదని ప్రజలు భావిస్తున్నట్లు ఆయన తెలిపారు,

జగనన్న ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ లకు 200 యూనిట్ల వరకు ఫ్రీ కరెంటు ఇచ్చారని ఇప్పుడు వాటికి కూడా చార్జీలు వసూలు చేస్తున్నారని అన్నారు. జగనన్న రైతులకు 9 గంటలు ఉచిత కరెంటు ఇస్తే, ఇప్పుడు దానిని 6 గంటలకు కుదించారని కుటమి ప్రభుత్వం వైఖరి వల్ల పేద బడుగు బలహీనవర్గాల ప్రజలు అవస్థలు పడుతున్నారని,ప్రభుత్వం విద్యుత్ పై పెంచిన అదనపు చార్జీలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటపాక ఎంపీటీసీ తమ్మిశెట్టి లక్ష్మి తమ్మిశెట్టి కొండ, పల్లెవాడ ఎంపీటీసీ సాదు కొండయ్య, కైకలూరు మండల కో ఆప్షన్ సభ్యులు సోమల శ్యాంసుందర్, ఉచ్చుల చిన్ని రాజు, షేక్ రఫీ, వర్ల నాగరాజు, పంజా రామారావు,తోట మహేష్, ఉందరమట్ల యేసు కుమార్, సింగంశెట్టి రాము, బిరుదుగడ్డ లాజరు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర డీలర్ల సంఘం కార్యదర్శి సూర్యచంద్రరావు మృతి



**నరసాపురం, మేజర్ న్యూస్** : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రేషన్ డీలర్ సమైక్య కార్యదర్శి, పశ్చిమగోదావరి జిల్లా రేషన్ డీలర్ల అసోసియేషన్ కోశాధికారి, నరసాపురం పట్టణ రేషన్ డీలర్ల కార్యదర్శి పెరుమాళ్ళ సూర్యచంద్రరావు(72) సోమవారం రాత్రిమృతి చెందారు. ఆయనకు భార్య కుమారుడు కలరు. కొంతకాలంగా అనారోగ్యంగా ఉంటూభీమవరం హాస్పటల్లో చికిత్స పొందుతూ మృతి చెందారు. మంగళవారం శివాలయం సెంటర్ నందు గలపెద్ద పోస్ట్ ఆఫీస్ ఎదురుగా ఉన్న వారి నివాసం నుండి హిందూ స్మశాన వాటిక వరకు ఊరేగింపు చేసి అంత్యక్రియలు నిర్వహించారు. సుదీర్ఘ కాలంగా నరసాపురం డీలర్ల సంఘం కార్యదర్శిగా ఆయన పని చేస్తున్నారు. సూర్యచంద్రరావు మృతి పట్ల ఆర్డీవో దాసిరాజు, తాసిల్దార్ రాజరాజేశ్వరి,సివిల్ సప్లై డిప్యూటీ తాసిల్దార్ ఐతమ్ సత్యనారాయణ, ఆర్ ఐ లక్ష్మీనారాయణ, డీలర్ల సంఘం అధ్యక్షులు అధికారి ఏసు, పలువురు వీఆర్వోలు, డీలర్లు, రెవిన్యూ సిబ్బంది సంతాపం తెలిపారు.

# అంబేద్కర్ గురుకులం విద్యార్థిని శృతికి రాష్ట్ర స్థాయి బహుమతి



**పెదపాడు,మేజర్ న్యూస్:** జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో డాక్టర్. బి.ఆర్ అంబేద్కర్ గురుకులం,వట్లూరు విద్యార్థిని కె.శృతి రాష్ట్ర స్థాయిలో మండవ బహుమతి సాధించింది.మంగళవారం నిర్వహించిన వినియోగదారుల అవగాహన సదస్సులో ప్రసంగించి అందరిని ఆకట్టుకుంది. ఈ సదస్సులో జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రి రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట లక్ష్మమ్మ, డి. ఎస్. ఓ సత్యనారాయణ రాజు ,వినియోగదారుల ఫోరం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. డి.ఎస్.ఓ చే కళాశాల ప్రిన్సిపాల్ దాసరి మేరీ ఝాన్సీ రాణి సమక్షంలో నగదు బహుమతి, మెమెంటో అందుకుంది. ప్రిన్సిపాల్ ,ఉపాధ్యాయులు ఆ విద్యార్థినికి అభినందనలు తెలిపారు.

# ఘర్షణకు కారణమైన వ్యక్తులు అరెస్ట్




**కైకలూరు,మేజర్ న్యూస్** : ఓ రాజకియనేత పుట్టినరోజు సందర్భంగా కైకలూరు డిగ్రీ కాలేజ్ నందు ఈ నెల 18న క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తుండగా కైకలూరు మండలం ఆటపాక గ్రామం జానపేటకు చెందిన కూనవరపు సతీష్ కుమార్ (జాన్ పేట సతీష్),మరో ముగ్గురు వ్యక్తులు ఆర్గనైజర్స్తో గొడవపడి వారిని కొట్టారని పోలీసులకు ఫిర్యాదు అందింది. గడిదేసి విజయకుమార్ కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో జాయిన్ అవ్వగా, టౌన్ పోలీస్ వారు గవర్నమెంట్ హాస్పిటల్ కు వెళ్ళి గడిదేసి విజయ కుమారు దగ్గర హాస్పిటల్ స్టేట్ మెంట్ తీసుకుని పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తు అనంతరం. 23న సాయంత్రం మచిలీపట్నం నందు ఈ కేసులో మొదటి ముద్దాయి అయిన కూనవరపు సతీష్ కుమార్ ( జాన్ పేట సతీష్)ని టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సై అరెస్టు చేసి.ముద్దా యిని కైకలూరు జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు. అనంతరం మెజిస్ట్రేట్ కేసులో ముద్దాయి కూనవరపు సతీష్ కుమార్కు 14 రోజులు రిమాండ్ విధించారని టౌన్ ఎస్ఐ తెలిపారు.

# సంతృప్తికరంగా ధాన్యం కొనుగోళ్లు





– రూ. 642.82 కోట్ల విలువైన 2.79 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం

**ఏలూరు,మేజర్ న్యూస్ :** ఏలూరు జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు వేగంగా జరుగుతుంది. రైతుల నుంచి చేపడుతున్న ధాన్యం కొనుగోళ్లు, బిల్లుల చెల్లింపులపై రైతులు సృంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో రైతుల నుంచి ప్రభుత్వం ధాన్యం సేకరిస్తున్న విధానం బాగుందని పలువురు రైతులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. జిల్లాలో పలుమార్లు పర్యటించి ధాన్యం సేకరణ తీరును జిల్లా ఇన్చార్జి మంత్రి,రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజరు వి.శ్రీలక్ష్మి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి,జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి ల ప్రత్యేక పర్యవేక్షణలో జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు సాఫీగా,సజావుగా జరుగుతుందన్నారు. ప్రస్తుత ఖరీఫ్ లో రైతుల నుంచి 244 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇంతవరకు 35 వేల 706 మంది రైతుల నుంచి 2,79,534 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. రైతు కోరిన రైస్ మిల్లుకు తరలించేందుకు 82,64,849 గోనే సంచులను 2345 వాహనములను వినియోగించారు. ఇంతవరకు 642.82 కోట్ల రూపాయల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేయగా అందులో ఇప్పటికే 584.95 కోట్ల రూపాయలను రైతుల వ్యక్తిగత ఆధార్ అనుసంధానిత బ్యాంక్ ఖాతాలలో జమచేశారు. మరో రూ. 56.19 కోట్ల జమ చేయు ప్రక్రియలో ఉందన్నారు.అదేవిధంగా గత ధాన్యం బకాయిలకు సంబంధించి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రైతులకు రూ.472 కోట్లు కూటమి ప్రభుత్వం చెల్లించింది.

## భూమి సమస్యల పరిష్కారానికి సదస్సులు : ఆర్డీఓ దాసిరాజు

**నరసాపురం రూరల్, మేజర్ న్యూస్ :** భూమికి సంబంధించిన అన్ని సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రెవిన్యూ సదస్సులు నిర్వహిస్తుందని ఆర్డీవో దాసి రాజు అన్నారు. మంగళవారం మండలంలోని దర్భ రేవు గ్రామంలో జరిగిన సదస్సు కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సర్పంచ్ అధ్యక్షత వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ భూములకు సంబంధించి ఎన్నో ఏళ్లుగా పెండింగ్లో ఉన్న అనేక సమస్యలు ఈ సదస్సుల ద్వారా పరిష్కారం అవుతున్నాయి అన్నారు. రైతుల నుండి వచ్చిన ఫిర్యాదులను విచారణ చేసి పరిష్కారం చూపుతున్నట్లుఆయన తెలిపారు. మొత్తం రెవెన్యూ యంత్రాంగం అంతా సదస్సులపై దృష్టి కేంద్రీకరించి రైతాంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.పలువురు రైతులు మాట్లాడుతూ కంపెనీ భూములకు సంబంధించి అర్హులకు గతంలోనే రిజిస్ట్రేషన్ అయ్యిందని, ఐదు శాతం భూములు రిజిస్ట్రేషన్ కాలేదని ఆ సమస్యలు పరిష్కరించాలని, పలు కాలువలకు మరమ్మతులు చేపట్టాలని ఆర్డీవో దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం ఆర్డీవో దాసి రాజు మాట్లాడుతూ రైతుల నుండి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా



కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ ప్రసాద్, ఆర్ ఐ లక్ష్మీనారాయణ, వీఆర్వో మెహర్ ఇతర రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షునిగా పొన్నమండ ముత్యలరావ్



**పాలకొల్లు, మేజర్ న్యూస్:** జాతీయ బీసీ సంక్షేమ సంఘం పాలకొల్లు నియోజకవర్గ సమావేశం స్థానిక ప్రెస్ క్లబ్ భవనంలో రాష్ట్ర అధ్యక్షులు వర్కింగ్ కమిటీ ముద్దాడ గణేష్ భవాని ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనమాల శ్రీనివాసరావు. జిల్లా అధ్యక్షులు కోడె యుగంధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణేష్ భవాని మాట్లాడుతూ ఈ నెల 19 వ తేదీన రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టరు నిమ్మల రామానాయుడు కి రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన శాఖమంత్రి వాసం శెట్టి సుభాష్ను కలిసి బీసీ హాస్టల్లలో విద్యార్ధుల సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. ఈ నెల 23వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బీసీ వెల్ఫేర్ సమావేశం ఏర్పాటు చేసి బీసీ మహిళా హాస్టల్ లలో మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని. గత 8 నెలలుగా మెస్ చార్జీలు ఇవ్వడం లేదని,వాటిని కూడా వెంటనే అమలు చేయాలని స్థానిక సంస్థలలో బీసీలకు ఉన్న 24 శాతం రాజకీయ రిజర్వేషన్లు..34 శాతం పెంచి చట్టబద్ధత కల్పించాలని,

తీర్మానం చేయడం మంచి శుభ పరిణామం అని ,గణేష్ భవాని అన్నారు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనమాల శ్రీనివాసరావు మాట్లాడుతూ చట్ట సభలలో బీసీలకు 50శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు కోడె యుగంధర్ మాట్లాడుతూ బీసీ జాబితాలో ఉన్న రాజకీయ రిజర్వేషన్లు ఏ.బి.సి.డి. లుగా అమలు చేయాలని కోరారు.

పాలకొల్లు నియోజకవర్గ అధ్యక్షునిగా పొన్నమండ మూత్యలరావు నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు వర్కింగ్ కమిటీ ముద్దాడ గణేష్ భవాని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనమాల శ్రీనివాసరావు జిల్లా అధ్యక్షులు కోడె యుగంధర్ నియామక పత్రాలు అందజేశారు, ఈ కార్యక్రమంలో వింజరాపు శంకరం, కోరుకొండ సుబ్బారావు, తమ్మిరీ వెంకటేశ్వరావు,నిలాంశెట్టి సత్యప్రసాద్,వేనేతల దుర్గారావు,వీరవల్లి కృష్ణ,వందరాపు శ్రీనివాసరావు ,వివిధ కుల సంఘాల నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు,

## దీర్ఘాయుష్మాన్ భవ అంటూ ఎమ్మెల్యేకు దీవెనలు

**– సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందుకున్న బాధితులు**



**జీలుగుమిల్లి, మేజర్ న్యూస్ :** అనారోగ్యం పాలై ఆపదలో ఉన్నప్పుడు ఆదుకున్నవాడు భగవంతుడుతో సమానమని ఆ కోవ కు చెందిన వ్యక్తి శాసనసభ్యులు చిర్రి బాలరాజు అని బాధితులు ఆయనను నూరేళ్లు దీర్ఘాయుష్తో జీవించాలని దీవించారు. మంగళవారం పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు బర్రింకలపాడులోని క్యాంప్ కార్యాలయంలో అనారోగ్యంతో బాధపడితున్న 12మంది బాధితులకు సుమారు రూ.17లక్షలు చెక్కులను బాధితులకు అందజేశారు. అనారోగ్యాల పాలై ఆపదలో ఉన్న తమను కూటమి ప్రభుత్వం, ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆదుకున్నారని ప్రభుత్వానికి ఎమ్మెల్యే బాలరాజు కు కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం కష్టాల్లో ఉన్న ప్రతి ఒక్కరికి చేయూతగా ఉంటుందని ఈ సందర్భంగా చిర్రి బాలరాజు పేర్కొన్నారు.

## చర్చి వార్షికోత్సవ వేడుకలో పాల్గొన్న ప్రభుత్వ విప్ నాయకర్



**నరసాపురం రూరల్,మేజర్ న్యూస్ :** మండలంలోని రుస్తుంబాధ పంచాయతీ మంగళ గుంట పాలెంలో లూదరన్ చర్చ్ వార్షికోత్సవ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం సందర్భంగా చర్చిలో జరిగిన ప్రార్థనలో రాష్ట్రప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ 13వ వార్షికోత్సవ వేడుకలో పాల్గొనే అవకాశం ఇచ్చినందుకు సంగస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకర్ మాట్లాడుతూక్రైస్తవ సంఘాలకు ఎటువంటి ఆస్తులు లేనప్పటికీ ఎంతో భక్తి శ్రద్ధలతో సంఘాలను కాపాడుకుంటూ వేడుకలు ఘనంగా జరిపిస్తారని అన్నారు. డిసెంబర్ నెల అంతా ఏదో ఒకచోట క్రిస్టమస్ వేడుక నిర్వహిస్తారని, బోధనల పట్ల ఎంతో భక్తి శ్రద్ధలతో ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంఘ కాపరులతోపాటు సర్పంచ్ బందెల భారతి, జనసేన నాయకులు ఆ కేన చంద్రశేఖర్, వలవల నాని, బందెల రవీంద్ర, వట్టిప్రోలు సతీష్తదితరులు పాల్గొన్నారు.

## సూర్యచంద్రరావుకి నివాళులర్పించిన 'కొత్తపల్లి'



**నర్సాపురం,మేజర్న్యూస్:** రాష్ట్ర రేషన్ డీలర్ల సమైక్య కార్యదర్శి,పశ్చిమగోదావరి జిల్లా రేషన్ డీలర్ల కోశాధికారి, నర్సాపురం మండలం రేషన్ డీలర్ల కార్యదర్శి పెరుమాళ్ళ సూర్యచంద్రరావు మృతి పట్ల మాజీ మంత్రి, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు సంతాపం తెలిపారు. మంగళవారం సూర్యచంద్రరావు నివాసంలో ఆయన మృతదే హాన్ని సందర్శించి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కొత్తపల్లి మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా డీలర్ల ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటం చేశారని ఆయన మృతి తీవ్ర లోటుగా కొత్తపల్లి అభివర్ణించారు. రాష్ట్ర సిపిఐ నాయకులు నెక్కంటి సుబ్బారావు,పశ్చిమగోదావరి జిల్లా రేషన్ డీలర్ల అసోసియేషన్ అధ్యక్షులు అధికారి వీర వెంకట సత్యనారాయణ,రాష్ట్ర రేషన్ డీలర్ల సంయుక్త కార్యదర్శి సమయమంతుల సర్వేశ్వరరావు, నరసాపురం మొగల్తూరు ఎలమంచిలి పాలకొల్లు భీమవరం మండలాల రేషన్ డీలర్లు సంఘ సభ్యులు కనగళ్ల అనంతసత్య వెంకట సుబ్బారావు జానపముల శ్రీరాములు తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.